ప్రజాశక్తి

సోమవారం 24 నవంబర్ 2025

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు డిమాండ్ చేశారు. ఆదివారం కురుపాంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లు అమలు చేస్తోందన్నారు. ఇప్పటివరకు వరకు 100 మంది పైగా కార్మికులు ఉన్న కంపెనీలు లే-ఆఫ్ లేదా లాకౌట్ చేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ నిబంధనను 300 మందికి పెంచడం కార్మిక హక్కులపై దాడేనని మండిపడ్డారు. లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే, యాజమాన్యాలు ఉద్యోగులను ఎప్పుడైనా తొలగించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్లు అమలు జరిగితే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు పువ్వల తిరుపతిరావు, మండంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్కారు వారి

కొను‘గోల్ మాల్’ కేంద్రాలు

- క్వింటాకు రూ.2500 వరకు నష్టం
- వ్యాపారుల చేతుల్లో పత్తి రైతు చిత్తు
- చోద్యం చూస్తున్న మార్కెటింగ్ శాఖ

జిల్లాలో పత్తి కొను‘గోల్ మాల్’ జరుగుతోంది. వ్యాపారుల వలలో చిక్కుకుని పత్తి రైతులు చిత్తవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట దళారులకు కాసులు కురిపిస్తోంది. క్వింటాకి రూ.2500 నుంచి 3 వేల వరకు రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర క్వింటాకు పొడవు గింజ రకం రూ.8110, పొట్టి గింజ రకం రూ.7700గా నిర్ణయించినా ఆ ధరకు కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుతం వ్యాపారులు క్వింటా 5450 రూపాయలకే కొనుగోలు చేస్తున్నారు. తేమశాతం, నాణ్యత లేదన్న సాకుతో వ్యాపారులు మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు పండించిన పత్తిని నిల్వ చేసుకునే సామర్థ్యం లేక వ్యాపారులకు అమ్మకానికి సిద్ధమవుతున్నారు.

గ్రామాల్లో పత్తి కొనుగోలు చేస్తున్న దళారులు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో 17 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. సాలూరు, పాచిపెంట, భామిని, కొమరాడ మండలాల్లో పత్తి అధికంగా సాగు చేస్తున్నారు. గత నెలలో మొంథా తుపాను కారణంగా మన్యం జిల్లాలో కురిసిన వర్షాలకు వందలాది ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింది. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు పడడంతో కొంత వరకు పత్తి రంగు మారింది. 12 శాతం కన్నా ఎక్కువ తేమ ఉంటే వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు నష్టానికైనా వ్యాపారులకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో మొదటిసారిగా పత్తి కొనుగోలు కేంద్రాన్ని సాలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రారంభించారు. భామినిలోనూ మరో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రాల వద్ద కూడా వ్యాపారుల ఆధిపత్యం నడుస్తోంది. రైతులు తీసుకొచ్చిన పత్తిని కొనుగోలు కేంద్రం అధికారులు రకరకాల సాకులతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అదే వ్యాపారులు తీసుకొచ్చే సరుకుని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో వ్యాపారులకు అమ్మకానికే రైతులు మొగ్గు చూపుతున్నారు. సాలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా కొనుగోళు మాత్రం రామభద్రపురం మండలంలోని ముచ్చర్లవలస జిన్నింగ్ మిల్లు వద్ద చేపడుతున్నారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన రైతులు పత్తిని కొనుగోలు కేంద్రానికి రవాణా చేయలేక నష్టానికి విక్రయిస్తున్నారు. రైతుల నుంచి క్వింటా పత్తిని 5450 రూపాయలకు కొనుగోలు చేసిన వ్యాపారులు రూ.2 వేలు లాభానికి అమ్ముకుంటున్నారు. రైతుల ఇ-క్రాప్ వివరాలు, ఆధార్ కార్డులు తీసుకుని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారంలో కొనుగోలు కేంద్రం అధికారులు, వ్యాపారుల మధ్య అవగాహన ఒప్పందం నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చోద్యం చూస్తున్న మార్కెటింగ్ శాఖ

రైతులు పండించిన పంటకు మద్దతుధర లభించేలా చూడాల్సిన బాధ్యత ఉన్న మార్కెటింగ్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్న పరిస్థితి నెలకొంది. జిల్లాలో సాలూరు, భామినిలో ప్రభుత్వ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ప్రయివేటు వ్యాపారుల దందా కొనసాగుతోంది. క్వింటాకు 2500రూపాయల వరకు రైతులు నష్టపోతున్నారు. తేమశాతం, నాణ్యతా ప్రమాణాలు సాకు చూపి వ్యాపారులు కొను ‘గోల్ మాల్’ చేస్తున్నారు.

ఘటనా స్థలం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

నదిలో కొట్టుకుపోతున్న యువకులు

జంఝావతి రబ్బర్‌డ్యామ్ వద్ద

ముగ్గురు గల్లంతు

ఒకరిని కాపాడేందుకు ఒకరికొకరు దిగి..

ప్రజాశక్తి- కొమరాడ, కురుపాం

మండలంలోని జంఝావతి రబ్బరు డ్యామ్‌లో స్నానానికి దిగి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. శివిని గ్రామంలో జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి ఇతర ప్రాంతాల్లో ఉంటున్న గ్రామానికి చెందిన స్నేహితులంతా రావడంతో సరదాగా సాయంత్రం రబ్బరు డ్యామ్ వద్దకు వెళ్లి నదిలో దిగడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

కొమరాడ మండలం శివిని గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు రాయగడ శరత్‌కుమార్ (17), అరసాడ ప్రతాప్ (29), అధికార గోవిందనాయుడు (35) ఆదివారం సాయంత్రం జంఝావతి రబ్బరు డ్యామ్‌లో స్నానానికి దిగి గల్లంతయ్యారు. శనివారం శివిని గ్రామంలో జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి గ్రామానికి చెందిన ఇతర ప్రాంతాల్లో ఉంటున్న పలువురు యువకులు వచ్చారు. గ్రామంలో ఉంటున్న శరత్‌కుమార్, ప్రతాప్‌తోపాటు ఇతర ప్రాంతంలో ప్రయివేటు ఉద్యోగం చేస్తున్న గోవిందనాయుడు, మరో ఐదుగురు స్నేహితులతో కలిసి కోసం జంఝావతి రబ్బరు డ్యామ్ దిగువన నదిలో స్నానానికి దిగారు. రబ్బరు డ్యామ్‌పై నుంచి నీరు ప్రవహించే ప్రదేశంలో దిగువన గోతులు ఉండడాన్ని గమనించలేదు. ఈ నేపథ్యంలో శరత్‌కుమార్ తొలుత మునిగిపోయాడు. అతడిని కాపాడేందుకు ప్రతాప్, గోవిందనాయుడు కూడా దిగి కొట్టుకుపోయారు. సమీపం నుంచి చూస్తున్న తోటి స్నేహితులు వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే వారు మునిగిపోయి కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ సంఘటనతో గ్రామంలోనూ, కుటుంబ సభ్యుల్లోనూ తీవ్ర విషాదం అలముకుంది. విషయం తెలుసుకున్న కొమరాడ ఎస్‌ఐ కె.నీలకంఠం ఘటనా స్థలానికి తన సిబ్బందితో చేరుకొని మునిగిపోయిన యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. పార్వతీపురం నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. నదిలో నీటి ఉధృతి అధికంగా ఉండడంతో ఇరిగేషన్ సిబ్బంది.. నీటిని వ్యవసాయ పొలాలకు వెళ్లే ప్రధాన కాలువ గుండా మళ్లించారు. యువకుల ఆచూకీ లభ్యం కాకపోవడంతో గ్రామస్తుల్లోనూ కుటుంబ సభ్యుల్లోనూ విషాదఛాయలు అలముకున్నాయి. ఘటన జరిగిన ప్రదేశంలో కుటుంబ సభ్యుల రోదన అందరినీ కంటతడి పెట్టించింది.

మంత్రి అచ్చెన్న ఆరా

జంఝావతి రబ్బరు డ్యాంలో పడి ముగ్గురు యువకులు గల్లంతుపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరాతీశారు. జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించారు.

కుటుంబ నేపథ్యం

గోవింద నాయుడు.. గ్రామంలోని వెల్డింగ్ షాప్ పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన తండ్రి చనిపోగా తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలు రెండు, మూడో తరగతులు చదువుతున్నారు.

శరత్‌కుమార్.. పార్వతీపురం పట్టణంలోని ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. తండ్రి ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శరత్‌కు అన్నయ్య తుశాంత్ ఉండగా ఇద్దరూ ఒకే కళాశాలలో ఒకే తరగతి చదువుతున్నారు.

ప్రతాప్.. గ్రామంలో స్నేహితుని వివాహం కోసం రాగా ఈ సంఘటన జరిగింది. మచిలీపట్నంలో రొయ్యల చెరువులో పనిచేస్తున్నాడు. తండ్రి వ్యవసాయ కూలీ కాగా, అన్నయ్య విశాఖపట్నంలో ప్రయివేటు ఉద్యోగం, చెల్లి ఊరిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో అసిస్టెంట్ గా పనిచేస్తున్నారు.

బాలికలకు స్వీయ రక్షణ అవసరం

'రాణి లక్ష్మీ భాయ్' కార్యక్రమంలో కలెక్టర్ పిలుపు

ప్రజాశక్తి-సీతానగరం

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల బాలికలకు స్వీయ రక్షణ అవసరమని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల బాలికల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ సామర్థ్యాలను పెంపొందించడమే రాణి లక్ష్మీభాయ్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. సమగ్ర శిక్ష, రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'రాణి లక్ష్మీ భాయ్' స్వీయ రక్షణ కార్యక్రమం సీతానగరం మండలం జోగమ్మపేట కెజిబివిలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రాణి లక్ష్మీ భాయ్' స్వయం రక్షక కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించుకున్నట్లు చెప్పారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతిఒక్కరికీ ఆత్మరక్షణ అవసరమని, దాని ప్రాధాన్యతను బాలికలకు వివరించారు. విద్యతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలు ఎంత ముఖ్యమో తెలిపారు. ఎన్ని డిగ్రీలు ఉన్నా, ఎంత విద్య నేర్చినా ముందుగా మన ప్రాణాలను కాపాడుకునే తెలివితేటలను ప్రతిఒక్కరూ కలిగి ఉండాలని ఉద్బోధించారు. ఆత్మరక్షణలో నైపుణ్యాలు లేకపోతే ఎదురయ్యే సమస్యలను కలెక్టర్ విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. బాలికలు భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

శిక్షణలో భాగంగా విద్యార్థినులు కరాటే, జూడో వంటి ఆత్మరక్షణ పద్ధతులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల బాలికల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ సామర్థ్యాలను పెంపొందిస్తామని సమగ్ర శిక్ష అధికారులు తెలియజేశారు.

అనంతరం పాఠశాలలో జరుగుతున్న ముస్తాబు కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ముస్తాబు పక్కాగా అమలుచేయాలని, విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు కూడా పాటించాలని ఆదేశించారు. అంతకుముందు పాఠశాలలోని తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలు, ఆహారాన్ని కలెక్టర్ పరిశీలించారు. శుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, కో-ఆర్డినేటర్ ఎస్.ప్రభాకర్, తహశీల్దార్ జె.ప్రసన్నకుమార్, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ బి.లక్ష్మణరావు, ఎంఇఒ ఎం.వెంకటరమణ, కెజిబివి ప్రిన్సిపల్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న కలెకర్టర్ ప్రభాకర్‌రెడ్డి, జెసి యశ్వంత్, తదితరులు

సత్యసాయి శత జయంతి ఉత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సత్యసాయి బోధనలు.. సమాజానికి మార్గదర్శకాలు

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

సత్యసాయి బోధనలు సమాజానికి శాశ్వత మార్గదర్శకాలని మంత్రి సంధ్యారాణి తెలిపారు. సాలూరు ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. సత్యసాయి ఎల్లప్పుడూ చెప్పిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస విలువలు ప్రతిఒక్కరి జీవితంలో ఆచరణీయమైనవని మంత్రి వివరించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి మంత్రి పూజలు చేశారు.

పార్వతీపురం పట్టణంలో సత్య సాయిబాబా ఆలయంలో జిల్లా యంత్రాంగం, సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సత్యసాయి శత జయంతి వేడుకల్లో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు.

పాలకొండ, సీతంపేటలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు సీతంపేట ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ హాజరయ్యారు.

పుస్తక మహోత్సవంపై ప్రచారం

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రచారం చేస్తున్న నిర్వాహకులు

పార్వతీపురం మన్యం పుస్తక మహోత్సవం నిర్వాహక బృందం పట్టణంలోని ప్రధాన కేంద్రాల్లో ప్రచారం చేపట్టింది. ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని ఈ నెల 25 నుంచి డిసెంబర్ 5 వరకు జరగనున్న పుస్తక మహోత్సవం తేదీలు, రోజువారీ కార్యక్రమాల షెడ్యూల్ గురించి వివరించారు. ప్రజలు ఆసక్తిగా స్పందించి, పుస్తక మహోత్సవం విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రచారం ద్వారా పుస్తకాల పట్ల అవగాహన, పఠనంపై ఆసక్తి మరింతగా పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. పుస్తకాల పట్ల ఆసక్తిని పెంపొందించడం, పఠన సంస్కృతిపై మరోసారి ప్రజల్లో చైతన్యం చేయడం, చిన్నారుల నుండి పెద్దల వరకు జ్ఞానాన్ని చేరవేయడం ఈ పుస్తక మహోత్సవ ప్రధాన లక్ష్యమని సమన్వయకర్త కిరణ్ చెప్పారు. ఉత్తరాంధ్ర సాహిత్య వారసత్వాన్ని ప్రతిబింబించేలా స్థానిక కవులు, రచయితల పుస్తకాల ఆవిష్కరణలు, కవితా కార్యక్రమాలు, రచయితల పరిచయాలు, సమీక్షలు ప్రతిరోజూ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంప్రదాయకం నుండి ఆధునికత వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలకు వినోదంతోపాటు చైతన్యాన్ని అందించనున్నాయని వెల్లడించారు. ఈ పుస్తక మహోత్సవం 25న సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతుందని, ప్రతిరోజూ సాయంత్రం 4.30 నుండి రాత్రి 9 గంటల వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు.

పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టుతో

ఆదివాసీల జీవితాలు నాశనం

ప్రాజెక్టు పెడితే పోరాటానికి సిద్ధం : వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి-మక్కువ

దుగ్గేరులో చింతా గ్రీన్ ఎనర్జీ పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు పెడితే ఆదివాసీల జీవితాలు నాశనమవుతాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లి గంగునాయుడు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళితే, ఈ ప్రాంత ప్రజలను కలుపుకొని పోరాటానికి సిద్ధపడతామని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మండలంలోని దుగ్గేరులో శనివారం ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కద్రక రామస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గంగునాయుడు మాట్లాడారు. మన్యం జిల్లాలో మూసివేసిన పరిశ్రమలు తెరిపించకుండా, కార్మిక వర్గానికి, ప్రజలకు కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. మరోపక్క జిల్లాలో పాచిపెంట మండలం సరిహద్దుల్లో గుజ్జిలి హైడ్రో పవర్ ప్రాజెక్టు, మక్కువ మండలం దుగ్గేరులో చింతా గ్రీన్ ఎనర్జీకి హైడ్రో పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం దారుణమన్నారు. వందలాది ఎకరాలు భూమి, కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని పెట్టుబడిదారులకు దోచిపెట్టడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. అపార ఖనిజ సంపద ఉన్న గిరిజన ప్రాంతాలను అంబానీ, అదానీ, పెట్టుబడిదారీ వర్గానికి అప్పజెప్పాలని నిర్ణయంలో భాగంగానే మోడీ చేస్తున్న నిర్ణయాలకు రాష్ట్రంలో కూటమి పార్టీలు కృషిచేస్తున్నాయని ధ్వజమెత్తారు. అందులో భాగంగానే గిరిజన జీవితాలను నాశనం చేసి, పవర్ ప్రాజెక్టు యాజమాన్యానికి లబ్ధి చేకూర్చేందుకు పాకులాడుతున్నాయని దుయ్యబట్టారు.

మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లి గంగునాయుడు

2వేల మెగా వాట్ల విద్యుత్ ప్రాజెక్టును రూ.25 వేల కోట్లు ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మిస్తే ఎవరికి ఉపయోగం ఉంటుందో ప్రభుత్వం చెప్పే పరిస్థితుల్లో ఉందా? అని ప్రశ్నించారు. మరో కోనసీమలా ఉండే దుగ్గేరు ప్రాంతంలో పచ్చని పంట పొలాలు, వాణిజ్య పంటలు విశాలమైన గిరిజన ప్రాంతం విస్తరించి ఉందని తెలిపారు. దీంతోపాటు ఏడాది పొడవునా ప్రవహించే ఆడారు జీవనది సైతం అంతమయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. వెంగళరాయ సాగర్, తోటపల్లి నుండి నీరు తేవడం వల్ల వాటిపై ఆధారపడ్డ రైతులు మరింత వ్యవసాయానికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. ఇలాంటి పరిస్థితిని ప్రభుత్వాలే కల్పిస్తున్నాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ గిరిజనులకు నష్టం చేసే విధానాలను అంగీకరించబోమని హెచ్చరించారు. ఈ ప్రాజెక్టు అనుమతులపై ప్రభుత్వం వెనక్కి తగ్గకుంటే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మర్రి శ్రీనివాసరావు, గిరిజన సంఘం నాయకులు టాడంగి ప్రభాకర్ రావు, కొండగొర్రె ఆనంద్, గెమ్మెల జానకిరామ్, మెల్లిక రాము, తాడంకి సోములు, తాడంగి రాంబాబు, ప్రజాసంఘాల నాయకులు ఎన్.వై.నాయుడు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు కార్యదర్శులపై వేటు

ప్రజాశక్తి-కొమరాడ

కొమరాడ మండల కేంద్రంలోని సచివాలయ పరిధిలో నిధుల దుర్వినియోగంపై నలుగురు పంచాయతీ కార్యదర్శులను సస్పెన్షన్ వేటు పడింది. దాదాపు 40 లక్షల వరకు నిధులు దుర్వినియోగమైనట్లు గతంలో అనేక కథనాలు వెలుపడ్డాయి. ఆరు నెల క్రితం జిల్లా స్థాయి అధికారులు ఈ నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టగా, చర్యలు తీసుకోవడంలో జాప్యం చేశారు. ఎట్టకేలకు శనివారం సాయంత్రం గతంలో పనిచేసిన గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, వైకుంఠరావు, గణపతితోపాటు ఇప్పుడున్న కార్యదర్శి నాగరాజు.. మొత్తం నలుగురిని సస్పెండ్ చేశారు. 2021 నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు జరిగిన వివిధ నిధుల వినియోగంపై దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ప్రస్తుతం పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి నాగరాజు రూ.40 వేలు నిధులు దుర్వినియోగం చేసినట్లు అధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఎంపిడిఒ ఎస్.రమేష్ తెలిపారు.

కొమరాడ సచివాలయం

చెకుముకి పోటీలకు

విశేష స్పందన

ప్రథమ స్థానంలో మాతుమూరు, తమ్మినాయుడు హైస్కూళ్లు

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన చెకుముకి పోటీలకు విశేష స్పందన లభించింది. పార్వతీపురంలోని వేదాంత జూనియర్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో మాతుమూరు హైస్కూల్ (పాచిపెంట మండలం), తమ్మినాయుడు హైస్కూల్ (పాలకొండ) ప్రథమ స్థానంలో నిలిచాయి. డిసెంబర్ 21, 22, 23 తేదీలలో కాకినాడ జెఎన్‌టియులో జరిగే రాష్ట్ర స్థాయి సైన్సు సంబరాల్లో మన్యం జిల్లా తరఫున ఈ రెండు జట్లు పాల్గొంటాయని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సార్తి మహేశ్వరరావు, కొండపల్లి గౌరునాయుడు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఎపి మోడల్ స్కూల్, భామిని ద్వితీయ స్థానంలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బందలుప్పి (పార్వతీపురం మండలం), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వంతరాం (బలిజిపేట మండలం) తృతీయ స్థానంలో నిలిచాయని చెప్పారు. ప్రయివేటు పాఠశాలల విభాగంలో భాస్కర హైస్కూల్ (పార్వతీపురం) ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. 15 మండలాల నుంచి 16 ప్రభుత్వ పాఠశాలలు, 6 ప్రయివేటు పాఠశాలల 66 మంది విద్యార్థులు, గైడ్‌టీచర్లు పాల్గొన్నారని తెలిపారు.

సైన్స్ సంబరాల్లో జిల్లా గౌరవాధ్యక్షులు బివి రమణ, ఉపాధ్యక్షులు బి.ఎం. గౌరీశ్వర రావు, రేవళ్ల సతీష్ రాజు, చెకుముకి కన్వీనర్ కె.మురళి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్రా భాస్కరరావు, సీనియర్ నాయకులు లక్ష్మునాయుడు, అజయ్ ప్రసాద్, వేదాంత కళాశాల ప్రిన్సిపల్ పి.వెంకటరమణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన గిరిజన విద్యార్థులు

రాష్ట్ర స్థాయికి గిరిజన విద్యార్థులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

స్కూల్ గేమ్స్ అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు మండలంలోని కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఆరిక చరణ్, మండంగి అఖిల్, చంద్ర దేవ్, మండంగి శరత్‌బాబు, బిడ్డిక ఆదిత్య వర్ధన్, బిడ్డిక ప్రవీణ్ కుమార్ ఎంపికైనట్లు పీడీ మాధవరావు తెలిపారు. వీరిని హెచ్ఎం బి.శ్రీనివాసరావు, డిప్యూటీ వార్డెన్ అప్పారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి కొమరాడ

ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కొమరాడలో ఆదివారం కళ్లాల్లో ధాన్యాన్ని ఆరబోసి, సంరక్షిస్తున్న రైతులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుల ప్రకటనలే తప్ప కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో చిత్తశుద్ధి లేదన్నారు. ఇప్పటికే అనేక చోట్ల వరి నూర్పిళ్లు పూర్తిచేసి, రైతులు ధాన్యం సిద్ధంగా ఉంచారని తెలిపారు. వెంటనే ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

వాట్సాప్ గ్రీవెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశాల మేరకు ఆదివారం నుంచి వాట్సాప్ గ్రీవెన్స్ కార్యక్రమం చేపట్టారు. 7207011891 నంబర్‌కి ఫోన్ చేసి నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలియజేయవచ్చని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మూడు రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపనున్నట్లు తెలియజేసింది.

కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ శాంతకుమారి

ఘనంగా ఎన్‌సిసి డే

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

పట్టణంలో కొత్తవలసలో ఉన్న శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం 78వ ఎన్‌సిసి దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్‌సిసి పతాకాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపల్ బలగ శాంతకుమారి ఆవిష్కరించారు. ఎన్‌సిసి క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐక్యత, క్రమశిక్షణ నినాదంతో ఎన్‌సిసి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి కెప్టెన్ గుప్తా, కళాశాల అధ్యాపకులు, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

జలవిహార్‌లో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. పార్కులోని అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోట్ షికారు చేశారు. సాహసోపేతమైన క్రీడల్లో పాల్గొన్నారు. హ్యాంగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి జలకాలాడారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మేజర్ పంచాయతీలో విద్యుత్ పనుల కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపేస్తున్నట్లు ఆ శాఖ ఎఇ కోటేశ్వరరావు తెలిపారు. వైరిచర్ల కాలనీ, ఐటిడిఎ పెట్రోల్ బంకు, హాస్టల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మావుడి సోదరులకు డివిజి పరామర్శ

ప్రజాశక్తి-మక్కువ

జెడ్‌పిటిసి మావుడి శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు మావుడి రంగునాయుడును రాష్ట్ర ఎస్‌టి కమిషన్ పూర్వ చైర్మన్ డివిజి శంకరరావు ఆదివారం పరామర్శించారు. ఇటీవల వారికి మాతృవియోగం కలగడంతో వారిని పరామర్శించారు. వారి తల్లి అరుణమ్మ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

సిఐటియు మహాసభను విజయవంతం చేయాలి

జిల్లా అధ్యక్షులు రమణారావు

సిఐటియు జాతీయ మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-సీతంపేట

విశాఖలో జరిగే సిఐటియు ఆలిండియా మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు కోరారు. ఆదివారం సీతంపేటలో సిఐటియు, ప్రజా సంఘాల ఉమ్మడి సమావేశాన్ని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా లేబర్‌కోడ్ల రూపంలో తీసుకొచ్చిందని విమర్శించారు. ఉద్యోగ భద్రత లేకుండా చేయడం చాలా దుర్మార్గమన్నారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుకు అప్పగించేందుకు కంకణం కట్టుకుందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులంతా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తు పోరాట కార్యాచరణను జాతీయ మహాసభలో రూపొందిస్తారని తెలిపారు. సమావేశంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ఎ.అంజలి, ఎల్.రమాదేవి, దీప, ఎన్.రొయ్య భారీ, పి.రమాదేవి, ఎస్.సంతోషి, ఎ.సుబ్బారావు, ఎన్.వెంకటి, ఎం.కొండలరావు, బి.తిరుపతిరావు, జి.శ్రీరాములు, ఆరిక భాస్కర్ రావు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-పాలకొండ : నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాలు కాపాడే పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లింపులో నెలల తరబడి జాప్యం జరగడాన్ని తీవ్రంగా ఖండించారు. పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచుతామని, సుమారు 20 మందిని నియమిస్తామని ఎమ్మెల్యే బహిరంగంగా ప్రకటించిన నేటికీ ఆచరణలో అమలు కాలేదన్నారు. వెంటనే అధికార యంత్రాంగం, పాలకవర్గం జోక్యం చేసుకొని కార్మికుల వేతన బకాయిలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి సిహెచ్ సంజీవి, పి.వేణు, రఘు, రామారావు, సింహాచలం, గిరి, తదితరులు పాల్గొన్నారు.

ఎండిఎంను ప్రయివేటీకరించొద్దు

వినతి అందిస్తున్న సిఐటియు, ఎండిఎం నాయకులు

ప్రజాశక్తి-సాలూరు

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం డిమాండ్‌చేసింది. ఆదివారం సాలూరులో ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం సమస్యలపై వినతి పత్రాన్ని మంత్రి సంధ్యారాణి వ్యక్తిగత సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ సామూహిక వంటశాలలు పెట్టి భోజన పథకాన్ని ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగిస్తే గిరిజన ప్రాంతాలలో ముఖ్యంగా రహదారులు లేని గ్రామాల్లో లక్ష్యం నెరవేరినట్లు అవుతుందా? అని ప్రశ్నించారు. ప్రయివేటు ఏజెన్సీలకు ఇచ్చేందుకు సాలూరు, పార్వతీపురం, పాలకొండలో స్థలాలను పరిశీలిస్తున్నారని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అతి తక్కువ జీతాలకు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయని పరిస్థితి నెలకొందన్నారు. ఈ పరిస్థితులు మారేందుకు ప్రభుత్వం నిర్ణయాలు చేయాలి తప్ప ఉన్న వ్యవస్థను నిర్వీర్యం చేయడం మానుకోవాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.ఈశ్వరరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం నాయకులు శ్రీదేవి, కొండతామర తులసమ్మ, కొండతామర లూద్ర, సీదరపు గీత, భవాని, లక్ష్మి, సరోజమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలన్నీ గాలి మాటలే

వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు తాడ్డి యశోదకృష్ణ

ప్రజాశక్తి-సాలూరు

టిడిపి కూటమి ప్రభుత్వ హామీలన్నీ గాలిమాటలేనని, అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను మోసం చేస్తోందని వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు తాడ్డి యశోద కృష్ణ ధ్వజమెత్తారు. సాలూరులోని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర క్యాంపు కార్యాలయంలో ఆదివారం యశోదకృష్ణ విలేకరులతో మాట్లాడారు. టిడిపి కూటమి ప్రచారం చేసుకుంటున్న 'పంచ సూత్రాలు' వాస్తవానికి రైతులను అగాధంలోకి నెట్టేస్తున్న 'పంచ సంక్షోభాలు' అని వ్యాఖ్యానించారు. గత వైసిపి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి, వారి భారం తగ్గించేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, ఉన్న పథకాల అమలులో కూడా జాప్యం చేస్తూ అన్నదాతను నష్టాలలోకి నెట్టివేసిందని ఆరోపించారు. రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గకపోగా, ఎరువులు, విత్తనాల ధరలు పెరగడంతో రైతు జీవితం మరింత కష్టంగా మారిందని తెలిపారు.

ఇది వ్యవసాయ రంగంలో ఒక పెద్ద సంక్షోభం కాదా? అని ప్రశ్నించారు. అకాల వర్షాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగిన రైతులకు పరిహారం చెల్లింపులో కొత్త విధానాలు తీసుకొచ్చి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం కేవలం మాటలు చెబుతోందన్నారు. రైతు సంక్షేమంపై వారి ఉద్దేశం నిజమైతే, తక్షణమే పెరిగిన ధరలను అదుపు చేసి, నష్టపోయిన రైతులకు సరైన పరిహారం ఇచ్చి, హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నాగరాజు, గొర్లె వెంకటరమణ పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

తోటపల్లి శ్రీవెంకటే శ్వరస్వామి, కోదండరామ స్వామి ఆలయాల ధర్మకర్తల మండలి ఆదివారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా మార్కొండ పకీరునాయుడు, సభ్యులుగా రెడ్డి రాజేశ్వరి, శంబంగి పకీరు నాయుడు, గరుగుబిల్లి మీనా, వావిలపల్లి పద్మజ, ముచ్చకర్ల నారాయణ రావు, ఆరిక జానకి, బొమ్మాలి సుభాషిణి, భగవాన్ వరప్రసాద్ మిస్రో, ఎస్ లక్ష్మి, మరడాన కృష్ణంనాయుడు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆలయ ప్రధాన అర్చకులు వి.వి అప్పలాచార్యులుతో ఇఒ బండ్లమూడి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం తోటపల్లి ఆలయాల అభివృద్ధి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డొల్లు పారినాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపిపి ఉరిటి రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో కురుపాం ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు, టిడిపి నాయకులు మర్రాపు పురుషోత్తం నాయుడు, మరడాన తవిటినాయుడు, ప్రభుత్వ నాటక రంగ అకాడమీ డైరెక్టర్ అంబటి తవిటినాయుడు, గులిపల్లి సుదర్శన రావు, నంగిరెడ్డి మధుసూదనరావు, ట్రైకార్ సభ్యులు పువ్వల లావణ్య, ట్రైబల్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు నందివాడ కృష్ణబాబు, టిడిపి మండల కన్వీనర్ మరడాన నారాయణస్వామి, కోలా రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు

రాయుడు కుటుంబానికి

రూ.10 లక్షలు నష్టపరిహారమివ్వాలి

ప్రజాశక్తి - కురుపాం

ఇటీవల నాగావళి నదిలో గల్లంతై మృతి చెందిన మండంగి అన్నపురాయుడు కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు డిమాండ్‌చేశారు. ఆదివారం మండలంలోని బియ్యాలవలస గ్రామంలో అన్నపురాయుడు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పేద కుటుంబానికి చెందిన అన్నపురాయుడు ప్రమాదవశాత్తూ మృతి చెందారని, కుటుంబం ఆర్థికంగా అత్యంత కష్టాల్లో ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వం అత్యవసరంగా స్పందించి కనీసం పది లక్షల రూపాయల సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.తిరుపతిరావు, గిరిజన సంఘం నాయకులు జి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు

పార్వతీపురం, సీతంపేటలో వాహన తనిఖీలు చేపడుతున్న ఎస్ఐలు జగదీష్‌నాయుడు, అమ్మనరావు, పోలీసు సిబ్బంది

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో ఆదివారం సాయంత్రం పట్టణ ఎస్ఐ జగదీష్ నాయుడు ఆధ్వర్యాన ఫ్లైఓవర్‌పై రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోకి ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి అనుమానాస్పద వ్యక్తులు ప్రవేశించే అవకాశం ఉన్నందున ఈ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో ధోనుబాయి కూడలి వద్ద ఎస్ఐ వై.అమ్మనరావు ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాలు ఎక్కడ నుండి వస్తున్నాయి?, ఎక్కడికి వెళ్తున్నారని ఆరాతీశారు. మితిమీరిన వేగంతో వెళ్లవద్దని సూచించారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిబంధనలు పాటించాలని కోరారు.

8 హెల్త్ సెంటర్ భవనాలు మంజూరు

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం, చిదిమి ,పనసనందివాడ, తెట్టంగి, దశమంతపురం, చిన్నగొర గ్రామాలకు హెల్త్ సెంటర్ భవనాలు మంజూరైనట్లు పంచాయతీరాజ్ జెఇ డి.కళ్యాణి దుర్గ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. చిదిమిలో రూ.55 లక్షలు, వీరఘట్టం-2,3లకు రూ.55 లక్షలు, వీరఘట్టం-4 రూ.36 లక్షలు, దశమంతపురంలో రూ.55 లక్షలు, చినగొరలో రూ.55 లక్షలతో పిఎం ఎబిహెచ్ఐ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. తెట్టంగిలో రూ.17 లక్షలు, పనస నందివాడలో రూ.12 లక్షలతో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

పనిచేయని కంప్యూటర్లు

మూలకు చేరిన కంప్యూటర్లు

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని రెండు, మూడు సచివాలయాల పరిధిలోని ఉన్న కంప్యూటర్లు మూలకు చేరాయి. గత ప్రభుత్వంలోనే సచివాలయాలకు కంప్యూటర్లు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో సచివాలయానికి రెండు చొప్పున కంప్యూటర్లు పంపిణీ చేశారు. ఇవి గత కొంతకాలం నుండి పనిచేయకపోవడంతో అటు సచివాలయ ఉద్యోగులు, ఇటు అర్జీదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేవలం ఆన్‌లైన్ చేయడానికి తప్ప ప్రింట్లు రాకపోవడంతో బయట వ్యక్తులకు పంపించి ప్రింట్లు తీసుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంప్యూటర్లను బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి; పోటీలకు హాజరైన పలు జిల్లాల క్రీడాకారులు

రాష్ట్రస్థాయి బాలికల ఖోఖో పోటీల్లో

బోణీ కొట్టిన విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ ఆధ్వర్యాన విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో ప్రారంభమైన అండర్ 17 విభాగం బాలికల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజయనగరం జిల్లా బాలికల జట్టు బోణీ కొట్టింది. ఆదివారం ఈ రాష్ట్రస్థాయి పోటీలను రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు కలిసి ప్రారంబించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని అన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడి విజయం సాధించాలన్నారు. అనంతరం పావురాలు ఎగురవేసి, రిబ్బన్ కట్‌చేసి పోటీలను ప్రారంభించారు. మొదట విజయనగరం, గుంటూరు జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌కు టాస్ వేసి ఆటను ప్రారంభించారు. గుంటూరుపై విజయనగరం జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి రామారావు, డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి, ఎంఇఒ సత్యవతి, 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి రమణ

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

కేంద్రంలో మోడీ ప్రభుత్వం మావోయిస్టులను అంతం చేసేందుకు చేపట్టిన ఆపరేషన్ కగార్ ను తక్షణమే నిలిపివేసి. మావోయిస్టులపై జరుగుతున్న హింసాత్మక బూటకపు ఎన్‌కౌంటర్ల పై న్యాయ విచారణ చేపట్టాలని పలువురు వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బొబ్బిలిలోని గంటి ప్రసాదం స్మారక భవనంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ. సిపిఎం. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ఆపరేషన్ కగారు పేరుతో అమాయకపు గిరిజనులను పొట్టన పెట్టుకుంటోందని, గిరిజన హక్కుల కోసం పోరాటం చేస్తున్న నాయకులను ఎన్‌కౌంటర్ల పేరిట మావోయిస్టులను అంతం చేయాలని మోడీ, అమిత్ షా ప్రయత్నిస్తున్నారని అన్నారు. చర్చలకు వస్తామని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దండకారణ్యంలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను దారా దత్తం చేయడానికి మావోయిస్టులను ఎన్‌కౌంటర్లు చేస్తోందని అన్నారు. ఇప్పటివరకు జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ చేపట్టాలని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొట్నూరు శంకర్రావు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పోల ఈశ్వరరావు, ఎం.గోపాలం, ప్రగతిశీల కార్మిక సమైక్య జిల్లా కార్యదర్శి తమటాల అప్పలనాయుడు, రైతు సంఘం నాయకులు ఎస్. గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న తహశీల్దార్ శేఖర్

క్రమశిక్షణతో చదవాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని తహశీల్దార్ ఎన్.శేఖర్ సూచించారు. మండలంలోని దుడ్డుఖల్లు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా? లేదా, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గిరిజన విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లాలని సూచించారు.